క్లుప్తంగా

కలెక్టర్ దృష్టికి మండల సమస్యలు



కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసిన జెడ్పీటీసీ సభ్యురాలు సుస్మిత

ఎటపాక: మండల కేంద్రంలోని సమస్యలను జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత తదితరులు కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.బుధవారం రంపచోడవరంలో కలెక్టర్‌కు ఆమె కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఎటపాకలో సీహెచ్‌సీ, జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని, ఎయిడెడ్ పాఠశాలకు మండల పరిషత్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు గాను ఐటీడీఏ ద్వారా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు.

నేత్ర వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎటపాక: మండలంలోని గుండాల సచివాలయం పరిధిలోని పురుషోత్తపట్నంలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేయడంతో పాటు శస్త్రచికిత్స చేయిస్తోందన్నారు. సర్పంచ్ ఆదినారాయణ, ఆప్తమాలజిస్ట్ పార్వతి, వైద్య సిబ్బంది అంజిబాబు, లక్ష్మి తదితరులున్నారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : పెద్దఅడ్డపల్లి క్రీస్తు సంఘం చర్చిలో పాస్టర్ గంగన్నదొర, విశ్రాంత సర్వేయర్ మాణిక్యాలరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన క్రిస్మస్, న్యూయర్ వేడుకల్లో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరుపేద మహిళలకు ఎమ్మెల్యే చీరలను పంపిణీ చేశారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ యజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు తోట రాజేశ్వరరావు, మండల ఇన్‌చార్జి రఘునాథ్, నాయకులు లోవమ్మ, బాబి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు ఎంతో మేలు



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

గంగవరం : జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థదొర అన్నారు. జగ్గంపాలెం గ్రామంలో రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ తుర్రం లీలావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో గిరిజనుల భూములకు శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు. సర్వేను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి భూములు ఉంటే పంపకాలు చేసుకోవాలని సూచించారు. సూరంపాలెం ఎంపీటీసీ సభ్యురాలు కుంజం పద్మావతి, ఉప సర్పంచ్ లక్ష్మణదొర, వీఆర్వో సత్యనారాయణ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు

జి.మాడుగుల: భీరం పంచాయతీలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు బుధవారం సందర్శించారు. ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. నేతలు చిన్నబాబు, రెడ్డిబాబు పాల్గొన్నారు.

‘గడప గడప’తో సమస్యల పరిష్కారం



గిరిజనులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పెదకోడాపల్లిలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ పర్యటన
- పాడేరు, పెదబయలులో 'గడప గడప'కు విశేష స్పందన

పాడేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ బొడ్డాపుట్టు, సరియాపల్లి, వై.సోలములు, డి.సోలములు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 312 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల చెంతకే పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గ్రామాల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సర్పంచ్ గుల్లేలి అశ్విజ, ఎంపీటీసీలు ముదిలి సుబ్బమ్మ, పలాసి రాజేశ్వరి, వైస్ ఎంపీపీ కుంతూరు కనకలమ్మ, సర్పంచ్‌లు ఎస్.లక్ష్మణ్‌రావు, వి.రాంబాబు, ఎల్.పార్వతమ్మ, జి.నీలకంఠం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సూరిబాబు, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, నాయకులు లింగమూర్తి, సత్యనారాయణ, బాబుల్‌నాయుడు, రామలింగం, కోటిబాబు, సత్యవతి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: ప్రభుత్వం మన్యంలోని శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని పెదకోడాపల్లి పంచాయతీ ఆంద్రవర, మెట్టవీధి, పెదకోడాపల్లి, పెదకోడాపల్లి కాలనీ, చీమలమామిడి, చిన్నపోయిపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గున్నారు. ఆయనకు గ్రామస్తులు పూలమాలలు వేసి, తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 318 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామ సచివాలయ కేంద్రాల సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల మృతి చెందిన పెదకోడాపల్లి సర్పంచ్ సెగ్గె వెంకటరమణకు సంతాపం తెలిపి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. పంచాయతీలో అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం కోసం వెంకటరమణ కోరారని గుర్తు చేశారు.

అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అంద్రవర, పెదకోడాపల్లి, పెదకోడాపల్లి జంక్షన్ మూడు చోట్ల వైఎస్సార్‌సీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అంద్రవర గ్రామానికి చెందిన కొర్రా చిత్తాయిని మాట్లాడుతూ సీఎం జగన్ వల్లే అన్ని గ్రామలు అభివృద్ధి చెందుతున్నాయని, కువి భాషలో చెప్పింది. అనంతరం ఆమెను ఎమ్మెల్యే పాల్గుణ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జెడ్పీటిసి కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వి.ఆనందరావు, సర్పంచ్ మోహన్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, సర్పంచ్‌లు సీహెచ్.రవిశంకర్, నాయకులు సూర్యనారాయణ, గంగాభవాని, అనిత, సూరయ్య, నవీణ, గోపాలరావు, కామయ్య, భూపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యలో సాంకేతిక విప్లవం



జి.మాడుగుల కేజీబీవీలో విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



ముంచంగిపుట్టు జోలాపుట్టులో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ నీలకంఠం, నేతలు



జర్రెలలో విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లతో పాఠశాల ఉపాధ్యాయులు

జి.మాడుగుల: ప్రభుత్వ విద్యలో సాంకేతిక విప్లవం ప్రారంభమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో కేజీబీవీలో బుధవారం 8వ తరగతి విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వినూత్న సంస్కరణలతో ఆధునిక ప్రపంచంతో పోటీపడే విధంగా సర్కారు పాఠశాలల్లో విద్యను అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో కె.నాగభూషణం, ఎంఈవో-2 సుందరమ్మ, హెచ్ఎం సువర్ణకుమారి, నాయకులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ట్యాబ్‌లను సర్పంచ్ నీలకంఠం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో శరవేగంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అనేక పథకాలు అమలుచేస్తోందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు కమల, హెచ్ఎం నిర్మల, నాయకులు జగబంధు, సులేమన్, మణి భగత్‌రాం తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని జర్రెల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం కుమ్మరి సింహాచలం 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను అందజేశారు.

అర్హులకు పథకాలు అందేలా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ అనూషా దేవి

చింతపల్లిరూరల్: స్థానిక సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆశ కార్యకరలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఎంపీపీ కోరాబు అనూషాదేవి బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ పుష్పలత, ఈవోపీర్డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ రామకృష్ణ, నేత లక్ష్మణ్ తదితరులు

గూడెంకొత్తవీధి: మండలంలోని దావనాపల్లి పంచాయతీ దొడ్డికొండ గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ బోయిన కుమారి బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. పనులను జేఈ జ్యోతిబాబు పరిశీలించారు. మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ తదితరులున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

గూడెంకొత్తవీధి: బియ్యం కార్డుల్లో ఐదేళ్లలోపు ఉన్న చిన్నారులకు విధిగా ఈకేవైసీ చేయించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. బియ్యం కార్డుల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించి, పలు సూచనలిచ్చారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ

కొయ్యూరు: మండలంలోని బంగారంపేట, మంప గ్రామాల్లోని ఆలయాల్లో ఆంజనేయస్వామి విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించారు. భీమునిపట్నం సద్గురు ఆశ్రమ ప్రతినిధి సాయిరాం స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలన్నారు. మన్యంలో ఇప్పటివరకు ఆశ్రమం ద్వారా 570 వరకు ఆంజనేయస్వామి విగ్రహాలను అందజేశామన్నారు. మల్లిబాబు, వీర్రాజు, సోమరాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల నియామకంపై హర్షం

పాడేరు రూరల్ : సిఐటియు రాష్ట్ర కమిటీలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులకు చోటు లభించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో జరుగుతున్న సిఐటియు మహాసభల్లో జిల్లాకు చెందిన వి.ఉమామహేశ్వరరావును రాష్ట్ర కమిటీ సభ్యులుగా , బోనంగి చిన్నయ్యపడాల్‌ను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా చోటు కల్పించారు. వీరితో పాటు ఆశ కార్యకర్తల నుంచి వై.మంగమ్మను రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలిగా అవకాశం కల్పించారు. వారి నియామకంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు పింఛన్ల సంబరాలు

చింతపల్లి: మండల కేంద్రంలో గురువారం వైఎస్సార్ పింఛన్ల సంబరాలు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి హాజరవుతారన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని ఆయన తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



అవగాహన కల్పిస్తున్న జయ

అరకులోయ రూరల్: బొండం పంచాయతీ రంగినిగుడలో రోటరీ క్లబ్ (విశాఖపట్నం)సహకారంతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఐద్వా నాయకురాలు వి.వి.జయ బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతు ఆర్థికంగా మహిళలను ప్రోత్సహించేందుకే రోటరీ క్లబ్ సహకారంతో 10 కుట్టు మిషన్‌లతో రెండు నెలల పాటు 50 మందికి శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. స్వయం ఉపాధి పొంది మహిళలు ఆర్థికాభ్రిద్ధి సాధించాలన్నారు. కళ, సుశీల, రాధ, లక్ష్మి, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



వనుగుమ్మలో కొత్త పింఛన్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: వనుగుమ్మ గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన 29 మందికి పింఛన్లను వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి బుధవారం పంపిణీ చేశారు. సర్పంచ్ మిల్కి, సచివాలయ కార్యదర్శి గోపీ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

పాడేరు రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రాధాకృష్ణ చెప్పారు. పాడేరు ఐటీడీఏ వద్ద మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ గిరిజన హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

అనారోగ్యంతో ఇటీవల విద్యార్థులు మృతి చెందారని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలన్నారు. పలు సంఘాల నాయకులు సురేంద్ర, లక్కు, ఫణీంద్ర, రాజశేఖర్, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు కృషి



వైఎస్సార్‌సీపీ కార్యాలయం పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కూనవరం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం పునర్నిర్మాణ పనులకు ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ బుధవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ పార్టీ సమావేశాలు నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కార్యాలయం పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ అనంతలక్ష్మి, సర్పంచ్‌లు అభిరామ్, నిరోషా, మండల పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు సునీత, నాయకులు బాబు, భరతమూర్తి, కొమ్మాని మోహన్‌రావు, కూనాపు వెంకట్రావు, కొమ్మాని వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



జీకే వీధిలో స్టాపర్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి



జి.మాడుగులలో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ, తహసీల్దార్ అప్పలస్వామి

గూడెంకొత్తవీధి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఎస్పీ సతీష్‌కుమార్, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో గూడెంకొత్తవీధి సర్కిల్ పరిధిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించామన్నారు. వీటిలో ప్రధానంగా చాపగెడ్డ, రామగెడ్డ, ముల్లుమెట్ట మలుపుతో పాటు రింతాడ పాఠశాల వద్ద అధికంగా ప్రమాదాలు జరిగినట్టు పోలీసు రికార్డుల్లో గుర్తించినట్టు సీఐ తెలిపారు. ఇక్కడ వాహనాల రాకపోకలు నియంత్రించేలా వేగాన్ని అదుపు చేసేందుకు వీలుగా స్టాపర్లను ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన స్టాపర్లను గమనించి వాహనచోదకులు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఎస్ఐ అప్పలసూరి సిబ్బంది ఉన్నారు.

తొమ్మిది మంది బైండోవర్

జి.మాడుగుల: సంకాంత్రి పండుగ నేపథ్యంలో పేకాట, చిత్తులాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు తొమ్మిది మందిపై బైండోవర్ చేసినట్టు వారు చెప్పారు. బైండోవర్ చేసిన వారికి సీఐ, ఎస్ఐతో కలిసి తహసీల్దార్ అప్పలస్వామి కౌన్సెలింగ్ నిర్వహించారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

అరకులోయ రూరల్: నేరాలు, దొంగతనాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు అరకులోయ సీఐ జి.దేముడుబాబు అన్నారు. దొంగతనాలు, నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలపై కరపత్రాలను ముద్రించినట్టు చెప్పారు. సీఐ దేముడుబాబు మాట్లాడుతూ ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పద్మాపురం, యండపల్లివలస గ్రామాల్లో పోలీసు సిబ్బంది పర్యటించి దొంగతనాలు నియంత్రణ జాగ్రత్తలను వివరించి, ఆయా కరపత్రాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అరకులోయలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గ్రామాల్లో అనుమానస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



గ్రామస్తులకు కరపత్రాలు అందజేస్తున్న పోలీసు సిబ్బంది

సేవలు మరింత విస్తృతం



గంగవరం ఎస్‌బీఐలో తనిఖీలు చేస్తున్న ఆర్ఎం సురేష్‌బాబు

గంగవరం: భారతీయ స్టేట్ బ్యాంక్ ద్వారా వినియోగదారులకు విస్తృతంగా మెరుగైన సేవలను అందిస్తున్నామని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ బ్రాంచిని ఆయన సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఖాతాదారులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకులు కంటే సులభతరంగా తమ సేవలందిస్తున్నామన్నారు. రుణ సౌకర్యాలు కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత రంపచోడవరం ఎస్‌బీఐను కూడా ఆయన సందర్శించారు. ఆయన వెంట బీఎం సునీల్‌కుమార్, క్యాష్ ఆఫీసర్ రమణ, లక్ష్మణమూర్తి ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



అభివృద్ధి పనులను వివరిస్తున్న పీఆర్ జేఈ రవితేజ

రాజవొమ్మంగి: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగింది. పంచాయతీల్లో నెలకొన్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు.హౌసింగ్ ఏఈ చలపతి మాట్లాడుతూ మండలానికి 272 శాశ్వతగృహాలు మంజూరు కాగా ఇప్పటికి 190 ఇళ్ల స్థలాలు జియో ట్యాగింగ్ చేశామన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. చెరకుంపాలెంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సభ్యులు కోరారు. మండల ప్రజాపరిషత్ బడ్జెట్ వెల్లడించాలని, జమ ఖర్చులు తెలపాలని సభ్యులు డిమాండ్ చేశారు. తగిన సమయం చూసి త్వరలో జమ ఖర్చులు వెల్లడిస్తామని ఎంపీడీఓ బాపన్నదొర వివరణ ఇచ్చారు. మండల వ్యాప్తంగా వేగంగా నిర్మాణాలు జరుగుతున్న సచివాలయాలు, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ల వివరాలను పంచాయతీ రాజ్ జేఈ రవితేజ సభకు వివరించారు. జాతీయ రహదారి విస్తరణ పనులకు సంభందించి ఆక్రమణలో ఉన్న భూములు, ఇళ్ళు, దుకాణాలను స్వాధీనం చేసుకొంటున్నట్లు తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి వెల్లడించారు. ఈ మేరకు 10వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించి ప్రజలకు వివరాలు తెలియజేస్తామన్నారు. కొమరాపురంలో ఉచిత బియ్యం అందలేదని సర్పంచ్ భీంరెడ్డి శుభలక్ష్మి తెలియజేయగా సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీలు చప్పా చంద్రరాణి, రాజేశ్వరి, సొసైటీ చైర్మన్ శింగిరెడ్డి రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు. సభలో వెల్లడించిన వివిధ అంశాలను ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఎంపీడీఓ బాపన్నదొర సభ్యులకు వివరణ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

గంగవరం: పశు సంవర్ధకశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది సమస్య పరిష్కరించాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేయన్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.అప్పన్నబాబు కోరారు. గ్రామాల్లో పశు శిబిరాల నిర్వహణ నిమిత్తం క్షేత్రస్థాయిలో పర్యటించాల్సి వస్తోందని, ఈ మేరకు ముఖ ఆధారిత హాజరు(ఫేస్ రికగ్నైజేషన్) నుంచి మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు.

ఆశ కార్యకర్తల నిరసన

ముంచంగిపుట్టు: లబ్బూరు పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో కలిసి సీఐటీయూ నాయకులు బుధవారం నిరసన చేపట్టారు. సిటూ మండల నాయకుడు శంకరరావు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శ్రీను, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన రేపు

కొయ్యూరు: మండల కేంద్రంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం పర్యటించనున్నట్టు ఎంపీపీ రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పింఛన్ల పంపిణీతో పాటు పార్టీ నాయకులతో సమావేశం నిర్వహింనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

7న ప్రజావేదిక

పెదబయలు: స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో ఈనెల 7న మండల ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపిడివో విగ్గిన్స్ తెలిపారు. 13,14 విడతలకు సంబంధించిన సామాజిక తనిఖీ కార్యక్రమం 2020-2021-2021-2022 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి అభివృద్ధి పనులకు సంబంధించి గత ఏడాది డిశెంబర్ 17 నుంచి ఈ నెల 6 తేదీ వరకు పంచాయతీలో సామాజిక తనిఖీ కార్యక్రమం జరుగుతుందని, 7వ తేదీన ఉదయం 10 గంటలకు మండల ప్రజావేదిక కార్యక్రమం జరుగుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి కూలీలు హాజరు కావాలని కోరారు.